**కథానిక** 'శ్రీ విరించి'

# తిరిగిరాని కథ

శేఖరం యిదివరకు కథలు వ్రాసేవాడు. ఇదివరకు అంటే ఒకటి రెండు సంవత్సరాల క్రితం కాదు. దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం మాట. అప్పుడు కాలేజిలో చదువుకునే రోజులు. చీకూ చింతా లేకుండా వుండేది. ఊరికే ఉత్సాహంతో ఉరుకులు పరుగులు ఆయన జీవితంలో భాగంగా, మంచి కాలక్షేపంగా కథలు గట్రా వ్రాస్తూ వుండేవాడు. చదవటానికి బాగా వుండడం వల్లనో యేమో పత్రికల వాళ్లు కూడా యీ కథలను ఆదరించి అచ్చు వేసుకునే వాళ్లు. ఆ రూపంగా అతడికి కథకుడుగా కాస్తో కూస్తో పేరు వచ్చింది. అటు స్నేహ బృందంలోనూ, బంధు జాలంలోను ప్రతిష్ట పెరిగింది. నలుగురిలోను తలెత్తుకు తిరగడానికి అలవాటు పడ్డాడు.

ఇదంతా గతకాలపు వైభవం అనుకున్నాం గదూ! ఇప్పుడతను కథలు వ్రాసినాడన్న సంగతి అతనికే గుర్తు లేదేమో. ఈ మధ్య కాలంలో అతనికి కథలు వ్రాయడం కాదు గదా పత్రికలు చదవడానికయినా కుదరకుండా పోయింది. వాటి మీద యేవగింపు కలిగిందని కాదు. క్షణం తీరికలేని ఉద్యోగాలలో చిక్కుకు పోయినాడు. వీటి ధోరణి చూస్తూ వుంటే ఒక్కొక్కమారు ఊపిరి పీల్చుకుందుకయినా సమయం లేదా అనిపిస్తుంది. ఇక కథలకు కాకరకాయలకు చోటు యెక్కడ? ఇవాళ ఒక ఊళ్లో, రేపు మరింకో వూళ్లో. ఉద్యోగం ఒక్కటే కాకుండా అతని సంసార పరిస్థితులు కూడా అలాగే తయారయినాయి. ఏదేనా విషయాన్ని గురించి సీరియస్‌గా ఆలోచించేందుకు గాని, నిలదొక్కుకుని సమాలోచించేదుకు గాని అతని వల్ల కావడమే లేదు. ఇంటి దగ్గర పరిస్థితులు సరిగా లేక వాటి నుంచి తప్పించుకుందుకే అతను యిలాంటి ఉద్యోగాలను ఎంచుకున్నాడేమో అనిపిస్తుంది చూచేవాళ్లకు. అయితే ఈ పుణ్యభూమిలో కావాలనుకున్న కోరుకున్న ఉద్యోగం లభించే అదృష్టవంతులు యెంత మంది? అనుకున్నదీ అయినదీ రెండు మార్గాలలో పోయి అతడి మనస్సును జరాసంధుడి శరీరం లాగ రెండుగా చీల్చి వేసినాయి. అటువంటి గుంజాటనలో పడిపోయినాడు అతను.

ఇంతకూ రైలు ప్రయాణంలో అతనికి రాజారాం అనే పాత స్నేహితుడు కనిపించి అడగక పోయినట్లయితే కథలు వ్రాయడం విషయం తిరిగి గుర్తుకు వచ్చేది కాదు, శేఖరానికి. ఈ కందిరీగల తుట్టె కదిలేది కాదు. కథల ప్రసక్తి తెచ్చి రాజారాం 'రచన అనేది గజ్జిలాంటిది అంటారే. అంత తొందరగా నీకు ఎలా వదిలిందబ్బా?' అన్నాడు.

శేఖరం జవాబేమి చెప్పలేదు. నవ్వేసి ఊరుకున్నాడు.

కాస్సేపు అయినాక 'నాకు ఏమంత పెద్ద పేరు లేదు. ఏదో కొన్నాళ్లపాటు

అదే పనిగా కథలు వ్రాశాను' అని అంతర్ముఖుడు అయిపోయినాడు. పెద్ద పేరు రాలేదని కొంత నిరాశ పడిన మాట కూడ నిజమే. అదే గుర్తు వచ్చింది యిప్పుడు. అయినా తనకు కథలు రాయడంలో చేయి తిరిగిన మాట మాత్రం యదార్థం. కథలు రాసే వాళ్లలో చాల మందిలాగ తను 'చక్ చక్' రాసి పడేసి నెలతిరిగే సరికి పది పదిహేను కథల చొప్పన 'ప్రొడ్యూస్' చేయలేదు. ఏపత్రిక పుటలు తిరగవేసినా తనపేరు కనిపించేలాగు చూచుకోవడం తనకు చేత కాలేదు. కథ రాయడం కోసరం మెటీరియల్ వెదకడంలో తను యెక్కువ సమయం గడిపేవాడు. ఆ వస్తువును గురించి చాలసేపు – చాల రోజులు – ఆలోచించుకుంటూ వుండే వాడు. ఎన్నోపాత్రలు అతని మనసును కన్వాస్‌గ ఉపయోగించి దానిమీద తమ చరిత్ర వ్రాసుకుంటూ పోయేవి. వానిలో నికార్సు అయినవి, తనకు బాగా నచ్చినవి, యితరులకూ నచ్చుతాయని నమ్మకం వున్నవాటిని వెలికితీసి కాగితం మీద పెట్టేవాడు. అతని పాత్రలు, అదేం కర్మమోగాని, కాగితం మీదికి రావడానికంటే మనసులో వుండి పోయేందుకు ఎక్కువ యిష్టపడేవి. తనూ వాటిని అంతగా బలవంతంచేసే వాడు కాదు. పోనీలే – వాటికి యిష్టం వచ్చినప్పుడే వస్తాయిలే యేం తొందర – అన్నట్లుగా ఊరుకునే వాడు.

'ఏమిటి ఆలోచనలో పడిపోయినావు? ఏమయినా చెబుతానని చూస్తూవుంటే, అన్నాడు రాజారాం బుజం కుదుపుతూ.

'నువ్వు కథల ప్రసక్తి తెస్తే మనస్సు వెనకటి రోజుల వయిపు పోయింది; 'అసలు నువ్వు కథలు వ్రాయడం ఎందుకు మానేశావు? నేనేం నీ కథలు చదివిన వాడిని కాదనుకో. అయినా ఎకడమిక్ యింటెరెస్ట్ కొద్ది అడుతున్నా'!

'ప్రత్యేకించి కారణం యేమిలేదు. రాయడం చేతకాక మానేశానను కుంటాను.'

'అది సాధ్యమా? ఒక పని కొన్నాళ్లు చేసిన తరువాత – చేతకాకుండా పోతుందా?'

'నువ్వు చెప్పేది మామూలు పనుల విషయంలో నిజం కావచ్చును. కాని రచన సృజనాత్మకమయిన పని. పిండి రుబ్బడం, గానుగెద్దులా గిరగిర తిరగడం అలవాటు అయిన కొద్దీ చేతనవుతాయి: రచనను వాటితో పోల్చటానికి వీలులేదు. వ్రాయలంటే లోపల నుండి అర్జ్ వుండాలి. తప్పనిసరిగా యీసంగతి యితరులకు చెప్పాలి ఇతరులతో యిది పంచుకోవాలి-అనుకోకుండా నేనెప్పుడూ యే కథ వ్రాయలేదు, యిదివరకు.''

''అయితే అటువంటి అర్జ్ యిప్పుడు లోపించిదన్న మాట. బాగా సంపాదనలో పడిపోయి వుంటావు' అన్నాడు రాజారాం. తరవాత ఆ ప్రసక్తి మానేసి యేవో మామూలు మాటలలోనికి జరిగి పోయినాడు.

ఆ రోజు ప్రయాణం పూర్తిచేసిన తర్వాత – యింటికి చేరుకున్న దగ్గర్నుంచీ శేఖరానికి మనసులో పురుగు తొలుస్తున్నట్లు అయింది. మంచి

సంఘటన ఒకటి తీసుకుని కథ వ్రాసి పడేశాడు. వ్రాసేసిన తర్వాత 'రిలీఫ్' చిక్కినట్లయింది. పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పుత్రకామేష్టి యజ్ఞంచేసినట్లు అనిపించింది.

మరునాడు బజారుకు వెళ్లినప్పుడు పత్రికల స్టాండ్ దగ్గర నిలుచుని 'విశ్వామిత్ర పత్రిక ఒక కాపీ యివ్వండి' అన్నాడు.

స్టాండ్ అసామీ అతన్ని ఎగాదిగా చూచి 'లేదు' అన్నాడు.

'పోనీ -అరుణ రేఖ.' అదే జవాబు.

ఇంకో రెండు పేర్లు కూడ అడిగి – లేదని పిలచుకుని శేఖరం యివతల పడ్డాడు. అతను సొంతం స్టాండ్ నుంచి దాటి వెళ్లకుండనే పత్రికలషాపు అతను అడ్డం తగిలి 'యేమండీ – మీరు యేమి అనుకోనంటే ఒక మాట' అన్నాడు.

ఏమిటిది? అన్నట్లు చూచాడు శేఖరం.

'నేను పది పన్నెండేళ్లుగా పత్రికల ఫీల్డ్స్‌లో వున్నాను. మీరు అడిగిన నాలుగు పత్రికలు నేను చూడనే లేదు. మీరుగానీ ఆ పేర్లతో కొత్త ప్రతికలు ప్రారంభించ దలుచుకుని వాటికి 'ప్రిపబ్లిసిటీ' యివ్వడం కోసం యిలా అడుగుతున్నారా అని అనుమానం వచ్చింది. నిజంచెప్పరూ' అన్నాడు.

శేఖరం అతనికి సంజాయిషి యిస్తూ 'లేదండీ నేను అడిగిన పత్రికలు పది హేనుయేళ్ల క్రిందట బాగా ప్రచారంలో వుండేవి. నేను యీ మధ్య వాటిని చూడడం లేదు. పోనీ పాత పత్రికలు యెలా వున్నాయో చూద్దామనిపించి అడిగాను అంతే. బహుశ ఆ పత్రికలు ఆగిపోయి వుంటాయి. పోనీ–ఒక పని చేయండి. ఇప్పుడు బాగా అమ్ముడు అవుతున్న కథల పత్రిక ఒకటి యివ్వండి. కాలక్షపానికి తీసుకుపోతాను' అన్నాడు.

షాపతను యివ్వడం – శేఖరం దాన్ని ప్రాణప్రదంగా తీసుకు వెళ్ళడం జరిగింది. కాని ఆ పత్రిక చదివే తీరుబడి మాత్రం దొరకలేదు. శేఖరం యిది పని కాదని తను రాసిన కథను ఆ పత్రిక చిరునామకు పోస్టుచేసి వూరుకున్నాడు. ఆ పత్రిక తన స్వగ్రామం నుంచి వస్తూ వుండడం అతనికి మరింత సంతుష్టి కలిగించినట్లు అయింది.

అయిదారు నెలల వరకూ అ పత్రిక కోసం ఆతురతగా చూడసాగాడు; తన కథ వచ్చిందేమోనని. అతని ఆశ నిరాశ అయింది ఆ తరువాత అతను దాని సంగతే మరచి పోయినాడు.

ఓ సంవత్సరం గడిచింది.

శేఖరం స్వగ్రామానికి వెళ్ల వలసి వచ్చింది. అనుకున్న పనులన్నీ పూర్తి చేసుకుని నిశ్చింతగా వెళ్లి పోవాలనుకున్నాడు గనుక వారం రోజులపాటు అక్కడ వుండిపోయాడు.

అతను వూరికి వచ్చిన రెండో నాడు 'అన్నట్లు అన్నయ్యా! చెప్పడం మరచాను, నీ క్లాసమేట్ దివాకరం యిక్కడ వుంటున్నాడు. అదేదో వార పత్రికకు ఎడిటర్‌గా వుంటున్నాట్ట. నన్ను అతను చూచి నీవు ఫలాన శేఖరం తమ్ముడివి గదూ! యిప్పుడు మీ అన్నయ్య యెక్కడున్నాడు, ఏం చేస్తున్నాడు అని కుశలప్రశ్నలు

వేశాడు. నువ్వు వస్తే తనని కలుసుకో కుండా పోవద్దని చెప్పాడు' అన్నాడు తమ్ముడు.

దివాకరం తెలికగానే గుర్తుకు వచ్చాడు శేఖరానికి. అయితే అతను పత్రిక ఫీల్డ్‌లో సెటిల్ అయిపోయినా డన్నమాట -అనుకున్నాడు.

తన పనుల వత్తిడిలో ఒకనాడు తీరుబాటుచేసుకుని దివాకరం ఆఫీసుకు వెళ్లాడు శేఖరం. దివాకరం అతన్ని చూచి చాల సంతోషించాడు. తన సబ్ ఎడిటర్లకు పరిచయం చేశాడు.

'యేమీ రాయడం లేదా యీమధ్య? మా పత్రికకు కధేమయినా యిచ్చివెళ్లు యీసారి, అన్నాడు దివాకరం వొంట రిగా వున్నప్పుడు.

శేఖరానికి సిగ్గు అనిపించిది అయినా సమాధానం చెప్పాలి గనుక, యేమి టోరా నాకు రాయడం చేతకావడం లేదు. సరీగా సంవత్సరనాడు ఓ కథ రాసి నీ పత్రికకే పంపాను. అచ్చు కాలేదు. బహుశ బాగాలేదేమో' అన్నాడు.

'నాన్‌సెన్స్ నీ కథ బాగా లేక పోవటమేమిటి, అందులోనూ నేను ఎడిటరు అయినప్పుడు?' అన్నాడు దివాకరం. అనడమేగాకుండా గుమ స్తాను పిలిచి శేఖరం పంపించానన్న నెలలో ఆ కథ వచ్చిందా, వస్తే యే మయింది వెదికి చెప్పమన్నాడు.

శేఖరం, దివాకరం దాదావు మూడు గంటలసేపు మాట్లాడుకుంటూ కూర్చు న్నారు. తీరా శేఖరం బయలుదేర బోతూ వుండగా ఆ గుమస్తా పెద్ద రిజిష్టర్‌తో సహా వచ్చి దివాకరంతో యేమిటో చెప్పసాగాడు. దివాకరం శేఖరం వయిపు తిరిగి 'సారీ శేఖరం నీ కథతో పాటు హామి పత్రం రాలేదు. అందుకని ఆ కథ నాదాకా రాకుండా చెత్త బుట్టలోకి వెళ్లిపోయింది' అన్నాడు.

'హామీ పత్రం యేమిటి?!'

'ఈ కథ నీ స్వంతమేననీ, దేనికీ అనుసరణ, కాపీకాదనీ, యింకే పత్రిక లకు పంపలేదని ప్రతి రచయిత హామీ యివ్వాలని కొత్తగా రూల్ పెట్టాంలే యీమధ్య. ఏమంటే దేశంలో కాపీ రచయితలు ఎక్కువయి పోయినారు' యింకా యేదో చెప్పుకు పోతున్నాడు దివాకరం.

'నా కథ నాదేనని హామీ యివ్వాలా!

'అవును' నీవు స్వంత చిరునామా కవరు పెట్టినా నీకు తిప్పి పంపేవాళ్లు. పోనీలే నీదగ్గర కాపీవుంటే ఊరికి వెళ్లగానే పంపించు నాకు. దివాకరం చాల ఎపోలజెటిక్‌గా ముఖం పెట్టాడు.

'పోనీలే ఆ కథ రాలేదని నాకేం విచారంలేదు. నువ్వేం బాధపడకు' అంటూ శేఖరం బయటకు నడచాడుః


## విజ్ఞప్తి

'అభ్యుదయ'కు సంబంధించిన ఉత్తరాలు, పంపే రచనలు ; మని ఆర్డర్లు, డ్రాఫ్టులు, చెక్కులు మొద లైనవి యీ దిగువ చిరునామాకు పంపవలసిందిగా విజ్ఞప్తి.

**ABHYUDAYA,**
R - 3, Llyods Estate,
Madras - 600 014